నేటి ఆంధ్రప్రగతి
APTEL 2023/16425
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)
సెల్: 8121133006
9494220260
ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 156 గురువారం 04 జనవరి 2024 పేజీలు 4. వేల :4 /

# ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

## - ముహూర్తం ఫిక్స్, కండీషన్స్ అప్లై..!!

ఆంధ్ర ప్రగతి అమరావతి జనవరి 03: మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏపీలో అమలుకు రంగం సిద్ధమవుతోంది. ఈ పథకం అమలు పైన ఆర్ధిక భారం..పొరుగు రాష్ట్రాల్లో ఎదురవుతున్న సమస్యలపైన ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. వరుస సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఎన్నికల్లోకి వెళ్తున్న అధికార వైసీపీ ఈ నిర్ణయం పైన ఆచితూచి అడుగులు వేస్తోంది. మహిళలకు ఈ పథకం అమలు చేస్తూనే..ఇతర వర్గాలకు అసౌకర్యం లేకుండా విధి విధానాలు ఖరారు చేస్తోంది.మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఏపీలోనూ ప్రారంభానికి రంగం సిద్ధం అవుతోంది. దాదాపు సంక్రాంతి నుంచి అమలు చేసే అవకాశం కనిపిస్తోంది. పథకం అమలు కారణంగా సంస్థ పైన పడే భారం పైన అధికారులు నివేదిక ఇచ్చారు. అదే సమయంలో కర్ణాటక, తెలంగాణలో అమలు సమయంలో ఎదురవుతున్న సమస్యల పైన అధికారులు వివరించారు.

పురుషులకు తలెత్తుతున్న ఇబ్బందులు, ఆటో కార్మికుల నుంచి వస్తున్న వ్యతిరేకత గురించి అందులో ప్రస్తావించినట్లు సమాచారం. దీని పైన అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఎవరి నుంచి వ్యతిరేకత లేకుండా మహిళలకు ఈ పథయం అమలయ్యేలా కొత్త విధి విధానాలు ఖరారు చేస్తున్నట్లు సమాచారం.

పూర్తి నివేదిక సిద్ధం చేసిన తరువాత పరిశీలించి సీఎం జగన్ తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పై మంచి స్పందన కనిపిస్తోంది. కర్ణాటక, తెలంగాణలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్టీసీలో నిత్యం సగటున 40 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో 15 లక్షలకు పైగా మహిళలు ఉంటారని తెలుస్తోంది.

ఆర్టీసీకి టికెట్ల విక్రయాల రూపంలో రోజుకు సగటున రూ 17 కోట్లు చొప్పున నెలకు రూ 500 కోట్ల వరకు వస్తోంది. ఇప్పుడు మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే నెలకు రూ 150–180 కోట్ల వరకు రాబడి కోల్పోయే అవకాశం ఉందని అధికారులు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పాటుగా ఇప్పటికే ఆర్టీసీ కి చెందిన రుణాలు.. రీయంబర్స్ మెంట్ ద్వారా ప్రభుత్వం నుంచి అందుతున్న ఆర్ధిక



ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుంటున్నారు.

కొత్త మార్గదర్శకాలతో అమలు: దీంతో..ఈ పథకం అమలు చేసినా..ఏ వర్గానికి ఇబ్బందులు..వ్యతిరేకత లేకుండా పకడ్బంధీగా అమలు చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా స్పష్టం అవుతోంది. అందులో భాగంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో చోటు చేసుకుంటున్న అంశాల పైన లోతుగా అధ్యయనం చేస్తున్నారు. అన్ని వివరాలు క్రోడీకరించి ప్రభుత్వానికి ఆర్టీసీ అధికారులు నివేదిక సమర్పించారు.

దీనిని ఆర్ధిక, రవాణా శాఖ అధికారులు అధ్యయనం చేసిన తరువాత ముఖ్యమంత్రికి తుది నివేదిక ఇవ్వనున్నారు. దీని పైన సీఎం తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు ప్రభుత్వం ఈ పథకం అమలు చేయాలని తుది నిర్ణయం తీసుకుంటే ఈ సంక్రాంతి నుంచే అమలు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

# వైసీపీకి మరో ఎమ్మెల్సీ గుడ్ బై..

## -చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిక.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జనవరి 03: ఏపీలో అసెంబ్లీ ఎన్నికల వేళ అధికార వైసీపీకి ఎదురుదెబ్బలు తప్పడం లేదు. ముఖ్యంగా కీలకమైన నేతలు పార్టీకి గుడ్ బై చెప్పేసి విపక్ష టీడీపీలో చేరిపోతున్నారు.ఇదే క్రమంలో ఇప్పటికే విశాఖకు చెందిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ వైసీపీని వీడి జనసేనలో చేరిపోగా.. ఇవాళ కడప జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్సీ అదే బాట పట్టారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఎన్నికల వేళ రాజకీయ పార్టీల్లో వలసలు సహజమే అయినా అధికార పార్టీలో నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు సైతం విపక్ష పార్టీలో చేరిపోతుండటం కలకలం రేపుతోంది. ఇవాళ అధికార వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ సి రామచంద్రయ్య ఆ పార్టీని వీడి టీడీపీలో చేరిపోయారు. చంద్రబాబు సమక్షంలో ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీల్లో పనిచేసిన ఆయన.. ఇవాళ మరోసారి టీడీపీలో చేరారు.టీడీపీలో చేరిన సందర్భంగా సి.రామచంద్రయ్య ఇవాళ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం మళ్లీ కోలుకోలేని విధంగా జగన్ అప్పులు చేశారని ఆయన



మండిపడ్డారు. ప్రజల చర్మం వలిచి పన్నులు కట్టిస్తే తప్ప జగన్ చేసిన అప్పులు తీరవని రామచంద్రయ్య తెలిపారు. రాష్ట్ర ఆర్ధిక పరిస్థితిపై జగన్ కు చెప్పినా వినే పరిస్థితి లేదన్నారు. అందుకే టీడీపీలో చేరుకున్నట్లు తెలిపారు. తనలాగే వైసీపీలో చాలా మంది ఉన్నారని రామచంద్రయ్య చెప్పుకొచ్చారు. వారంతా సమయాన్ని బట్టి బయటికి వస్తారన్నారు.

# ఇచ్చిన హామీ నెరవేరుస్తూ.. వృద్ధాప్య పెన్షన్‌ను 3 వేలకు పెంచి ఇస్తున్నాం.. సీఎం జగన్



**-ప్రతి నెలా రూ. 2 వేల కోట్ల ఖర్చుతో 66.34 లక్షల మందికి గడప వద్దకే పెన్షన్లు.**
**-గతంలో పింఛన్ రావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకునే పరిస్థితి.. నేడు లంచాలు, వివక్ష లేకుండా పెన్షన్.**
**-చంద్రబాబు అవినీతిలో దత్తపుత్రుడు భాగస్వామి కాబట్టే అయన్ను ప్రశ్నించరు.**
**-రాబోయే రోజుల్లో ఇంకా కుట్రలు, పొత్తులు ఎక్కువగా పెట్టుకుంటారు. కుటుంబాలను చీల్చి రాజకీయాలు చేస్తారు. వీటిపై మీరందరూ అప్రమత్తంగా ఉండాలి'.. కాకినాడ బహిరంగ సభలో సీఎం జగన్**

ఆంధ్ర ప్రగతి కాకినాడ జనవరి 03: "ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.3 వేలకు పెంచాం. నూతన సంవత్సరం అంటే తేదీ మారడం కాదు పేదలు, వృద్దుల జీవితాలు మారాలి. పేదల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలి. తమను తాము పోషించుకోలేని పరిస్థితి రాష్ట్రంలో ఎక్కడా ఉండరాదని దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా 66.34 లక్షల మందికి మంచి జరిగేలా పెన్షన్ అందిస్తున్నాం. పెన్షన్‌ల కోసం దాదాపుగా నెలకు రూ. 2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. పండుగైనా, సెలవైనా ఒకటో తేదీనే పెన్షన్ అందిస్తున్నాం. నా సైన్యం వాలంటీర్లు. వారి ద్వారానే సమయానికి పెన్షన్ పంపిణీ చేయగలుగుతున్నాం. అర్హత ఉంటే చాలు మీ కష్టం నా కష్టంగా భావించి ఈ రోజు ప్రతి ఒక్కరికి తోడుగా అండగా నిలబడే కార్యక్రమం ఈ రోజు మీ బిడ్డ పాలనలోనే జరుగుతుందని చెప్పడానికి గర్వపడుతున్నాను" అని సీఎం జగన్ రూ. 3 వేల పెన్షన్ పెంపుపై కాకినాడలో నిర్వహించిన బహిరంగ సభలో పేర్కొన్నారు. కాకినాడలో ఏర్పాటు చేసిన పింఛన్ల పెంపు సీఎం జగన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ కొత్త సంవత్సరం అంటే కేవలం క్యాలెండర్‌లో ఒక మార్పు మాత్రమే కాదని.. జీవితాల్లో మార్పు రావాలని సీఎం జగన్ అన్నారు. వారి ఆనందం కూడా మెరుగైన పరిస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పెద్ద వయసు ఉన్నవారు, విధి రాత వల్ల తమకు తాము పోషించుకోలేని పరిస్థితిలో అక్షరాల 64 లక్షల 34 వేల మంది ఉన్నారని నేడు ఆ అభ్యాగులకు, వితంతువులకు మంచి చేస్తూ సామాజిక పెంఛన్‌ను అక్షరాల రూ.3 వేలకు పెంచామని సీఎం తెలిపారు.

మిగతాది 4లో...



## విజయ సాయి రెడ్డి బావమరిది వైసీపీకి రాజీనామా.?

ఆంధ్ర ప్రగతి అమరావతి జనవరి 3: ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. నిన్నటికి నిన్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్, మరో కుమారుడు జయవీర్ మంగళవారం మధ్యాహ్నం వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.ఇది మరువక ముందే.. విజయసాయిరెడ్డి బావమరిది ద్వారకానాథ్ రెడ్డి వైసీపీకి రాజీనామా చేసినట్లు తెలుస్తుంది. ఆయన విజయవాడలో చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీ పార్టీలో చేరనున్నట్లు సోషల్ మీడియా వార్తలు హల్‌చెల్ చేస్తున్నాయి. కాగా ఈ విషయానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రాష్ట్రానికి జగనే పెద్ద అరిష్టం.. రాజకీయాలను అపవిత్రం చేశాడు



ఆంధ్ర ప్రగతి అమరావతి జనవరి 03: రాష్ట్రానికి జగనే పెద్ద అరిష్టమని, వైసీపీ నేతలు రాక్షసుల మాదిరిగా రాష్ట్రాన్ని దోచుకున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. జగన్ రాజకీయాల్లో లేకుండా ఉంటే రాష్ట్రంలో ఇంతటి విధ్వంసం జరిగేది కాదని, పోలవరం, రాజధాని అమరావతిని నాశనం చేశాడని దయ్యబట్టారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి అన్నమాటే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలను జగన్ అపవిత్రం చేశాడన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు ప్రజల కోసం 5 ఏళ్లు కష్టపడతారు..కానీ వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం ఎంజాయ్ చేసి, రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపడ్డారు. వైసీపీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకానాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు దాడి వీరభద్రారావు, ఆయన తనయులు దాడి రత్నాకర్, దాడి జైవీర్, బాపట్ల జిల్లా, కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, అనంతపురంనకు చెందిన డా.కె.రాజీవ్ రెడ్డితో పాటు పలువురు ముస్లిం నేతలు బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి చంద్రబాబు పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..."మరో వంద రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు అయిపోతాయి. మిగతాది 4లో...

-టీడీపీలో చేరిన వైసీపీ సీనియర్ నేతలు సి.రామచంద్రయ్య, ద్వారకానాథ్ రెడ్డి, దాడి వీరభద్రారావు.
-టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు సమక్షంలో చేరిక.
-అనంతపురం, బాపట్ల, చీరాల, పార్వతీపురం నియోజకవర్గాల నుండి పలువురు పార్టీలోకి రాక.
-అందరినీ సాదరంగా ఆహ్వానించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు.

# రాయలసీమ ఉద్యమనేత బొజ్జా దశరథరామిరెడ్డిని వెంటనే విడుదల చేయాలి.

**-బొజ్జా అరెస్టుకు నిరసనగా నంద్యాల శ్రీనివాససెంటర్ లో రైతుల రాస్తారోకో.**

**- సాగు, తాగునీరు ఇచ్చి రాయలసీమ కరువు దూరం చేయాలని అడిగితే ప్రభుత్వం అరెస్టు చేయడం అన్యాయం.**

**-బొజ్జాను భేషరతుగా విడుదల చేయకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం.**




ఆంధ్రప్రగతి నంద్యాల జనవరి03:
రాయలసీమ కరువు, వలసల శాశ్వత పరిస్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయకుండా మాకు నీరు అందించి ఆదుకోవాలని అడిగే రాయలసీమ ఉద్యమనేత బొజ్జా దశరథరామిరెడ్డిని అరెస్టు చేయడం అన్యాయమని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ప్రశ్నిస్తున్నారు.బుధవారం నంద్యాల శ్రీనివాససెంటర్ లో బొజ్జా దశరథరామిరెడ్డి అరెస్టుకు నిరసనగా రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రైతులు మానవహారంగా నిలిచి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై. ఎన్. రెడ్డి, సీనియర్ న్యాయవాది బి. శంకరయ్య, వై ఎస్ ఆర్ సి పి రైతు నాయకులు బిక్కెం రామసుబ్బారెడ్డి, ఇప్పల చిన్న తిరుపతి రెడ్డి,టి డి పి రైతు నాయకులు బాలలీశ్వర్ రెడ్డి, బాబు, గడివేముల మండల రైతు నాయకులు సంజీవరెడ్డి, పాణ్యం రైతు నాయకులు మురళీధర్ రెడ్డి, అభిరామ్ శ్రీనివాస్ రెడ్డి, బండి ఆత్మకూరు మండల నాయకులు రామకృష్ణా రెడ్డి, మున్సిపల్ కార్మికసంఘ నాయకులు షణ్ముఖరావు తదితరులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సంగమేశ్వర పుణ్య క్షేత్రం సమీపంలోని సిద్దేశ్వరంగ్రామం వద్ద కృష్ణానదిపై అలుగు నిర్మిస్తే సుమారు 60టి ఎంసి నీరు నిలిచి రాయలసీమ ప్రాజెక్టులకు అందుతాయన్నారు.రాయలసీమ సాగునీటి సాధన సమితి, రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు బొజ్జా దశరథరామిరెడ్డి నాయకత్వంలో 2016 మే 31 వ తేదీన రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాల నుంచి సుమారు 35 వేల మంది స్వచ్ఛందంగా తరలివచ్చి సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం ప్రజా శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు.ఆనాటి కేసులో ఇప్పుడు బొజ్జా దశరథరామిరెడ్డిని అరెస్టు చేశామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు.గత ఏడాది కర్ణాటక, ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో రాజకీయ లబ్దికోసం కేంద్రంలోని బి జె పి ప్రభుత్వం కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి రాయలసీమకు నీరు రాకుండా చేస్తోందని దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడంలేదని బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శలు చేస్తునందుకు అరెస్టు చేస్తున్నారా అని వారు ప్రశ్నించారు.కృష్ణానది యాజమాన్య బోర్డు ని కృష్ణానది పరివాహక ప్రాంతంలో జగన్ ప్రభుత్వం విశాఖపట్టణలో ఏర్పాటు చేయాలని నిర్ణయాన్ని బొజ్జా వ్యతిరేకించడం, తెలంగాణకు కృష్ణా నది జలాలు తరలించి రాయలసీమను ఎడారిగా మార్చే కేంద్రం నల్ల చట్టాన్ని రద్దు చేయాలని బొజ్జా రాజీలేని ఉద్యమం చేస్తున్నాడని, రాష్ట్ర ప్రభుత్వం అసమర్ధతను వామపక్ష పార్టీలతో కలిసి ఉద్యమం రూపం నీలదిస్తున్నం దుకే జగన్ ప్రభుత్వం బొజ్జా పై అక్రమ కేసులు పెట్టి, పాత కేసులు అంటూ అరెస్టు చేస్తుందని వారు ఆరోపించారు.
అరెస్టులతో రాయలసీమ ఉద్యమకారుల గొంతు నొక్కలేరని, బొజ్జా దశరథ రామిరెడ్డిని భేషరతుగా విడుదల చేసి కేసులు రద్దు చేయాలని, జగన్ ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి పెంచి కర్ణాటకలో అక్రమంగా నిర్మస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును ఆపాలని, తెలంగాణకు మేలుచేసే కృష్ణా నది నీటి తరలింపు నల్ల చట్టాలు రద్దు చేయించాలని, కర్నూలులో కె ఆర్ ఎం బి ని ఏర్పాటు చేయాలని, రాయలసీమలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.
ఈ నిరసన కార్యక్రమంలో కొమ్మా శ్రీహరి, పట్నం రాముడు, రాఘవేంద్ర, నారాయణగౌడ్, రామేశ్వరరెడ్డి, మునగాల మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రి భార్య సావిత్రిబాయి పూలే జయంతి.



ఆంధ్ర ప్రగతి పాణ్యం జనవరి 03:
పాణ్యం మండలం లో ఏ పి మోడల్ స్కూల్ లో ఘనంగా సావిత్రి బాయ్ పూలె 193వ జయంతి నిర్వహించి , విగ్రహాలకు ఎస్ఎఫ్ఐ విద్యార్థి, యువజన సంఘాలు ఘనంగా పూలమాలలు వేశారు. జిల్లా నాయకుడు ప్రతాప్ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే (1831 జనవరి 3%--% 1897 మార్చి 10) భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది.కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ, నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసింది. సమాజంలోని కులతత్వం, పురుషాధిక్య ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరికీ కూడా ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు.ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి అని చెప్పుతూ అంతకముందే స్కూల్ లో మహిళా ఉపాధ్యాయులు అందరు సావిత్రి బాయ్ , జ్యోతి రావు పూలె,విగ్రహాలు కు పూలమాలలు వేసి నివాలాలి అర్పించి, స్కూల్ లో ప్రతి ఆడపిల్ల విద్యార్థి,సమాజం లో దర్యం గా ముందుకు వెళ్లి అన్నిరంగాల్లో మహిళా ఉపాధ్యాయులు గా ఎదగాలి, మోడల్ స్కూల్ లో ప్రతి విద్యార్థి, క్రమశిక్షణ తో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాయకులు రాజా, సతీష్, నాగరాజు జగదీష్,ఉపాధ్యాయులు వీరేష్, చంద్రకళ, కవిత, కళావతి, ప్రవీణ రుక్సానా, భవాని తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమనేత బొజ్జ దశరథరామిరెడ్డి అరెస్ట్ ను రాజకీయం చేయడం తగదు.

## -ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:
ఉద్యమనేత రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి అరెస్ట్ ను ప్రతిపక్ష నాయకులు రాజకీయం చేయడం తగదని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పేర్కొన్నారు. ఉద్యమనేతలను వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీ నేతలు జైలుపాలు చేస్తున్నారని, రాజకీయ బురదజల్లే ప్రతిపక్ష నాయకుల ఆరోపణల్లో వాస్తవాలు లేవని ఎమ్మెల్యే అన్నారు. బొజ్జ దశరథరామిరెడ్డి అరెస్ట్ పై రాజకీయనాయకులు చేసిన వాఖ్యలపై ఎమ్మెల్యే బుధవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉద్యమనేత బొజ్జ దశరథరామిరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచడం జరిగిందన్నారు. 2016 సంవత్సరం మేనెల 31వ తేదీలో రాయలసీమ సాగునీటి సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, రైతులు సంగమేశ్వరం సిద్ధేశ్వరం వద్ద అలుగు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రజా శంకుస్థాపన కోసం పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు వారిని కట్టడి చేయడం జరిగిందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా చేపట్టిన ఉద్యమనేత, మరియు రైతు నాయకులపై నాటి టీడీపీ ప్రభుత్వంలో పోలీసులు కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఈ కేసుల విచారణ నిమిత్తం కోర్టుకు వాయిదాలకు హాజరు కావడంలేదని మెజిస్ట్రేట్ బొజ్జ దశరథరామిరెడ్డికి, ఇతర రైతు నాయకులను అరెస్ట్ వారెంట్ జారీచేయడం జరిగిందన్నారు. అయితే నాడు టీడీపీ ప్రభుత్వంలో పెట్టిన కేసులకు సంభందించి నాడు టీడీపీ ధశరథరామిరెడ్డిని, రైతునాయకులను అరెస్ట్ చేస్తే అది వైఎస్సార్సీపీ ప్రభుత్వం వైసీపీ నాయకులు ఉద్యమనేతలపై అనవసరంగా కక్షపూరితంగా కేసులు బనాయించి అరెస్టు చేయిస్తున్నారని టీడీపీ ప్రతిపక్షనాయకులు ఆరోపణలు, బురదజల్లే రాజకీయాలు చేయడం తగదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి స్వయంగా బొజ్జ దశరథరామిరెడ్డితో మాట్లాడటం జరిగిందని, కేసులకు, అరెస్ట్ సంబంధించిన పూర్తి వివరాలను, వాస్తవాలను తెలుసుకున్నామన్నారు. నాడు చేపట్టిన రాయలసీమ సాగునీటి సమితి ఉద్యమంలో పార్టీలకు అతీతంగా వైఎస్సార్సీపీ నాయకులు కూడా పాల్గొన్నారని గ్రహించాలన్నారు. రైతుల పక్షాన నిలిచిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం అని. ప్రతి రైతు మేలుకోరి ప్రభుత్వ అని తెలిపారు. ఎన్నికలు వస్తున్నాయని రాజకీయాలు చేయడం మానుకోవాలని ప్రతిపక్షనాయకులకు హితవు పలికారు. ఉద్యమనేత బొజ్జ దశరథరామిరెడ్డి అరెస్టు వైసీపీ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టంచేశారు.





# బొజ్జ దశరథరామిరెడ్డి ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భూమా.

ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు జనవరి 03:
రాయలసీమ సాగునీటి సాధన సమితి అద్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డిని నందికొట్కూరు సబ్ జైలు లో మాజీ ఎమ్మెల్యే భూమాబ్రహ్మానంద రెడ్డి పరామర్శించారు.భూమా మాట్లాడుతూ..రైతు సంఘం అధ్యక్షుడు..బొజ్జా దశరథ రామిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్ కి పంపడం వైసీపీ పార్టీ కక్షపురిత చర్య అని రైతుల కోసం రైతుల పంట్ట పొలాలకు నీళ్లు రావాలి అని పోరాడే ఉద్యమకారుని గొంతు నొక్కలనే ఉదేశ్యం తో ఎప్పుడో 2016 లో కేస్ ఉందో లేదో తెలియని కేస్ ను తీసుకొని వచ్చి కక్ష పురితం గా, అన్యాయం గా అరెస్ట్ చేయడం వైసీపీ పార్టీ హీనమైన చర్య అని ఈ అరెస్ట్ ను తెలుగుదేశం పార్టీ తరుపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని నంద్యాల నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి అన్నారు.భూమా బ్రహ్మానంద రెడ్డి తో పాటు రైతు సంఘం నాయకుడు బాలీశ్వర రెడ్డి, మాజీ కౌన్సిలర్ ముడియం కొండా రెడ్డి, కౌన్సిలర్ మహబూబ్ వలి, నంద్యాల టీడీపీ సీనియర్ నాయకుడు గౌస్ భాయ్, గోసుపాడు కన్వీనర్ చంద్ర శేఖర్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, %దీ%. తిరూపం రెడ్డి,మద్దిలేటి రెడ్డి, కమల్ బాషా, అలీ తదితరులు కలవడం జరిగింది.

# మెగా డీఎస్సీ విడుదల చేయాలని విద్యాశాఖ మంత్రి కార్యాలయం ముట్టడి.




ఆంధ్రప్రదేశ్ నంద్యాల జనవరి 03:
విజయవాడ నగరంలోని 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి. బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయాన్ని నిరుద్యోగులతో కలిసి ముట్టడించారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా అధ్యక్షులు మధుశేఖర్ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు మెగా డీఎస్సీ విడుదల చేస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాలు కావస్తున్న ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారని తప్పని పరిస్థితిలో ఈరోజు విద్యాశాఖ మంత్రికి మా నిరుద్యోగుల బాధలు చెప్పాలని వెళితే అక్రమంగా డీఎస్సీ అభ్యర్థులను డివైఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసే వివిధ పోలీస్ స్టేషన్లో ఉంచారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ ప్రకటించకపోతే ముఖ్యమంత్రి జగన్ ఎక్కడికి వెళితే అక్కడ ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాము, రామన్న నంద్యాల జిల్లా అధ్యక్షులు మధుశేఖర్ నంద్యాల పట్టణ కార్యదర్శి ఎస్. శివ నాయకులు రవీంద్ర, వినీత్, అఖిల్, వీరితోపాటు వివిధ జిల్లాలకు చెందిన డివైఎఫ్ఐ కార్యదర్శులు అధ్యక్షులు కార్యదర్శులు డివైఎఫ్ఐ నాయకులు డీఎస్సీ అభ్యర్థులు 100మందికి పైగా ఉన్నారు.

# 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌నీ ఆవిష్కరించిన బలిజ, కాపు సేవా సమితి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:
నంద్యాల పట్టణంలోని సమత విద్యానికేతన్ నందు నంద్యాల పట్టణ బలిజ, కాపు సేవాసమితి ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగిందని వ్యవస్థాపకులు దండే దస్తగిరి తెలిపారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు దండే దస్తగిరి మాట్లాడుతూ.. బలిజ, కాపు సేవాసమితి ద్వారా విద్య, వైద్యము మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి బలిజ సంఘీయులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. మున్ముందు బలిజ, కాపు సేవాసమితి తరపున సేవా కార్యక్రమాలు విస్తరిస్తామని అధ్యక్షులు కొప్పుల సుబ్బారెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సేవాసమితి తరపున నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగిందని, అలాగే నంద్యాల పట్టణంలో ఉన్న 42 వార్డులలో, చుట్టుపక్కల ఉన్న పరిసర ప్రాంతంలో ఉన్న బలిజ సంఘీయులను సేవాసమితి తరపున ఏకం చేసే దిశగా ముందుకు సాగుతున్నామని సేవా సమితి ప్రధాన కార్యదర్శి దండే వెంకట్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా బలిజసంగీయుడు సాహితీవేత్త కొప్పుల ప్రసాద్ కు సేవా సమితి తరపున ఘన సన్మానం చేయడం జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలలో ప్రథమ బహుమతి నిలిచిన ప్రసాద్ రాసిన కవిత. ఈ కార్యక్రమంలో సమత విద్యానికేతన్ కరస్పాండెంట్ బాలచంద్రుడు మాట్లాడుతూ బలిజ, కాపు సేవాసమితి ద్వారా నిర్వహించే కార్యక్రమాలు సంఘీయులకు మంచి చేసే విధంగా, విద్యను ప్రోత్సహించే విధంగా ఉన్నాయని ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సేవా సమితి వైస్ ప్రెసిడెంట్ కాశీ గారి శీను, జాయింట్ సెక్రెటరీ పత్తి రాజశేఖర్, సభ్యులు గద్వాల ఆదినారాయణ, దండే భవాని, తోట వెంకటేశ్వర్లు, వైయస్సార్ నగర్ రమేష్, ఇపూరి శేఖర్, పత్తి శివరాం ప్రసాద్, గురునాథ్, సల్లా రమేష్ రాయల్, దండు వెంకటేశ్వర్లు, జగడం ప్రసాద్, బలిజ సంఘీయులు పాల్గొన్నారు.

## తులసి రెడ్డి కార్యాలయంలో ఘనంగా సావిత్రిబాయి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:



సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి ఆఫీసు నందు మహాత్మ సావిత్రిబాయి పూలే గారి 193వ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు.సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ప్రముఖ సీనియర్ న్యాయవాది తెలుగుదేశం పార్టీ నాయకుడు తాతిరెడ్డి తులసి రెడ్డి మహాత్మ సావిత్రిబాయి పూలే కి పూలమాలలు వేసి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి భారత దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా స్త్రీకి విద్యను ప్రవేశపెట్టిన తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు.సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు రాష్ట్ర రజక సంఘం నాయకులు జిల్లెల్ల శ్రీరాములు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే పాఠాలు చెప్పేందుకు స్కూలుకు వెళుతున్న దారిలో సాంప్రదాయవాదులు ఆమెపై పేడా. రాళ్లు విసరడం వంటి అవమానాలకు గురి చేయగా సావిత్రిబాయి పూలే ఇవి నాకు పూలతో సమానం.ఇలా ప్రోత్సాహం ఇస్తున్నందుకు నాకెంతో సంతోషంగా ఉందని ప్రతిస్పందించారు.ఆచదువుల తల్లి సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా ఆదర్శ విప్లవ చైతన్య మూర్తికి అశ్రునివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు సామాజిక వర్గం నాయకుడు చింతలసుబ్బరాయుడు,న్యాయవాది డాక్టర్ జి బాలస్వామి,ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎన్ లక్ష్మణ్,శివశంకర్,బాలయ్య, బచ్చు నాగేశ్వర్ రెడ్డి,టి.టి.ఆర్ అసోసియేట్ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు.

## న్యూక్లియస్ జూనియర్ కాలేజీలో ఘనంగా సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలు.

**-సావిత్రిబాయి పూలే జయంతి రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ప్రజా సంఘాల నేతల డిమాండ్.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:
మహిళల ఆశాజ్యోతి, ఈరోజు ఆడపిల్లలు చదువుకుంటున్నారంటే ఆ చదువుల తల్లి సావిత్రి భాయి పూలే పోరాటమే నని, సావిత్రి భాయి పూలే జీవిత చరిత్రను ప్రతి ఆడపిల్ల తెలుసుకోవాలనీ , చదువుల తల్లి సావిత్రి భాయి పూలే గారి 193వ జయంతి సందర్భంగా నంద్యాలలోని స్థానిక న్యూక్లియస్ జూనియర్ కాలేజీలో సావిత్రిభాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. న్యూక్లియస్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ మురళీ , వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి , విద్యార్థినిలు , ప్రజా సంఘాల నేతలు సావిత్రిభాయి పూలే చిత్ర పటానికి ఘనంగా పూలమాలలు వేసి ఘనంగా నివాలులు అర్పించారు.ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్వీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు రామినేని రాజునాయుడు , డెమొక్రటిక్ స్టూడెంట్స్ - యూత్ అసోషియోషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్.రియాజ్ , ఎన్.టీ.ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగసారి సుంకన్న , డీ.ఎస్.వై.ఏ కార్యదర్శి ఖాదర్ భాషా తదితరులు మాట్లాడుతూ... విద్యార్థులు సావిత్రి భాయిపూలే గారు , మహాత్మా జ్యోతిబా పూలేల అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆలోచన విధానంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. చదువుల తల్లి సావిత్రిభాయిపూలే జయంతి రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని , కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. ఆ ఇద్దరు మహనీయుల త్యాగాలను స్మరించుకుని ఆ స్ఫూర్తితో ప్రతి బహుజన బిడ్డ మరియు విద్యార్థులు ముందుకు వెళ్లాలని వారు పిలుపునిచ్చారు.

## నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి.

ఆంధ్ర ప్రగతి నంద్యాలజనవరి 03:
నంద్యాల పట్టణం ప్రథమనందీశ్వరస్వామి దేవస్థానం సమీపంలో బుధవారం 3కోట్ల 62 లక్షల వ్యయంతో నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్టేషన్ ను ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సబ్ స్టేషన్ ఏర్పాటు వల్ల పట్టణంలోని పలు వార్డులలో తరచుగా తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలను అధిగమించి



నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణంలో మొక్కలను నాటారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నంద్యాల పట్టణ జనాభా పెరుగుతున్న దృష్ట్యా విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సేవలను అందించేందుకు నూతనంగా 3కోట్ల 62లక్షల వ్యయంతో నూతన 33/11 కే సబ్ స్టేషన్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సబ్ స్టేషన్ ఏర్పాటు వల్ల పట్టణంలోని పలు వార్డులలో నాణ్యమైన విద్యుత్ సేవలను అందుకోవచ్చున్నారు. అలాగే నంద్యాల పట్టణంలోని వివిధ వార్డులలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డా.శశికళారెడ్డి, దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతా అమృతరాజ్, వార్డు కౌన్సిలర్ షేక్ సంజీదా, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎలక్ట్రికల్ ఎస్ ఈ, ఈఈ రమణారెడ్డి, ఏడీఏలు, ఏఈలు, జేఈలు, వైఎస్సార్సీపీ నాయకులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# సావిత్రిబాయి పూలే ఫాతిమాషేక్ ల జయంతులను ప్రభుత్వాలే అధికారికంగా నిర్వహించాలి.

**-పట్నం రాజేశ్వరి**

ఆంధ్ర ప్రగతి కర్నూలు జనవరి 03:
చదువుల తల్లులు సావిత్రిబాయి పూలే ఫాతిమాషేక్ ల జయంతులను ప్రభుత్వాలే అధికారికంగా నిర్వహించాలని యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. స్థానిక టి.జి.వి.కళాక్షేత్రంలో యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సావిత్రిబాయి పూలే ఫాతిమాషేక్ ల జయంతి వారోత్సవాల సభలో ముఖ్య అతిథులుగా పట్నం రాజేశ్వరి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టరు నాగమ్మ పూలే, సిల్వర్ జూబ్లీ కళాశాల లెక్చరర్లు పార్వతీ, అఖ్తర్ భాను, సంచార జాతుల ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రుద్రాక్షల ఇందిరాదేవి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా మరియు గౌరవ అతిథులుగా నక్కలమిట్ట శ్రీనివాసులు, ఖధీరుల్లా,శేషఫణి, వేల్పుల జయచంద్ర, డాక్టర్ కంచర్ల హరిప్రసాద్, భరత్ కుమార్ ఆచారి, ఎరుకల రాజు, నాయకంటి జయన్న, యస్.డి.వి.అజీజ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగమ్మ పూలే మాట్లాడుతూ దేశంలో నేడు మహిళలు అన్ని రంగాల్లో ప్రవేశించి అభివృద్ధి చెందుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నామంటే అందుకు కారణం చదువు. ఆ చదువును మనకు అందించిన తల్లులు సావిత్రిబాయి పూలే ఫాతిమాషేక్ లే అన్న విషయం మర్చిపోవద్దని, వారికి మనం రుణపడి ఉన్నామని ఆమె అన్నారు. మతఛాందసవాదుల దాడులను ఎదుర్కొని మహిళల విద్య కోసం, వితంతు పునర్వివాహాల కోసం నిరంతరం తపిస్తూ, మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ మహిళల చదువు కోసం మహిళల ఆత్మగౌరవం హక్కుల కోసం నిరంతరం శ్రమించి తమ జీవితాలనే పణంగా పెట్టి పోరాడిన చదువుల తల్లులు సావిత్రిబాయి పూలే ఫాతిమాషేక్ ల విగ్రహాలను ప్రతి జిల్లా కేంద్రంలో మరియు పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని ఆమె




తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు అయిన అఫ్రీన్, హైమవతి,నిర్మల, వై.సువర్ణ లను మహిళా ఐక్య వేదిక మెమెంటోలు ఇచ్చి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక టీమ్ సభ్యులు భారతమ్మ ముడియం సునీత, కటికె భాను,ఆకుతోట పద్మావతి, ఎలీశమ్మ, హుస్సేన్ బీ, ఈరమ్మ , కొమ్ము పెద్దక్క , ఖాసింబీ, ఈశ్వరమ్మ, షేకూన్ బీ,లక్ష్మేశ్వరి,వడ్డే వరలక్ష్మి,సుధా, కమ్మరి లక్ష్మీ, వీణ, సుంకమ్మ శిరిగిరి లక్ష్మీ, జానకమ్మ, రత్న, ఈరమ్మ, రాధమ్మ, ఎర్రకోట లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించం

**- మా డిమాండ్స్ తీర్చే వరకు ధర్నా విరమించం**
**- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి సుగ్గయ్య**

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:
ఏపి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన చేస్తామని, డిమాండ్స్ తీర్చే వరకు ధర్నా విరమించేది లేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య పేర్కొన్నారు.నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా కార్యదర్శి సుంకయ్య, రాష్ట్ర కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు
ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఔట్ సోర్సింగ్ లో పనిచేయుచున్న పారిశు ధ్య, ఇంజనీరింగ్ విభాగ ఉద్యోగ, కార్మికులను, డ్రైవర్లను, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులను, పార్క్ వర్కర్లను, స్కూల్ స్వీపర్లను, టాయిలెట్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేసేంతవరకు ధరలకనుగుణంగా కనీస వేతనాలు 26 వేల రూపాయలివ్వాలని, పర్మినెంట్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికుల జిపిఎఫ్ ఖాతాలు సాంకేతిక సమస్యలు అంటూ ప్రభుత్వం వాయిదా వేయకుండా సత్వరం పరిష్కరించాలని, పర్మినెంట్ కార్మికులకు చెందిన 2021 నుంచి పెండింగ్లో ఉన్న డిఎ, సరెండర్ లీవ్స్ ఎంకాష్మెంట్ కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, జీవో నెంబర్ 30 సవరించి, నాటి కార్మిక శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా స్కిల్డ్ సెమిస్కిల్ట్, హైస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లలు విధుల్లో మరణిస్తే 30 లక్షల రూపాయలు, ప్రమాదాల బారిన పడితే 10 లక్షల రూపాయలు చెల్లించాలని, టైం స్కేల్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆయా కార్పోరేషన్, మున్సిపాలిటీ, నగరపంచాయితీ జనాబాకు తగ్గట్టుగా మున్సిపల్ కార్మికులు పిహెచ్, నాన్ పిహెచ్ వర్కర్లను నియమించాలని, కోవిడ్ 19 విపత్తులో పారిశుద్ధ్య పనులకు తీసుకున్న కార్మికులను యధావిధిగా కొనసాగించి, సాంఘిక భద్రత కల్పించాలని, డ్రైవర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వారికి స్కూలు స్వీపర్లకు,



టాయిలెట్ వర్కర్లకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, కరోనా విపత్తులో మరణించిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యాభై లక్షల రూపాయలు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం 18 వేల రూపాయలిచ్చి, సాంఘిక భద్రత కల్పించి అఫ్కాస్ లో చేర్చాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలాని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్రీనివాసులు, భూమిని శ్రీనివాసులు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రంజిత్, కార్యదర్శి ప్రతాప్, సహాయ కార్యదర్శి శివరాముడు, నాయకులు మస్తానయ్య, మద్దయ్య, లక్ష్మమ్మ మద్దిలేటి చిన్నమ్మ లలితమ్మ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జ దశరథ రామిరెడ్డి అరెస్టును ఖండిస్తున్నాం.

**-నంద్యాల జిల్లా కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు లక్ష్మి నరసింహ యాదవ్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:
నంద్యాల పట్టణంలో రాజీవ్ గాంధీ భవనం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ 2016లో కేసును తిరగతోడి బొజ్జ దశరథ రామిరెడ్డిని అరెస్ట్ చేసి, జైలుకు పంపడాన్ని కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా డిసిసి అధ్యక్షులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ ఖండించారు.2016 లోని పాత కేసును తిరగతోడి బొజ్జా దశరదరామి రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపటం దుర్మార్గం. దశరథరామిరెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం ఆనాడు 2016లో నేను కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. రాయలసీమ సాగునీటి సాధన కోసం ఉద్యమిస్తున్న బొజ్జ దశరథ రామిరెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించింది. గత 12



సంవత్సరాలుగా రాయలసీమ నీటి హక్కుల కోసం బొజ్జా దశరథరామిరెడ్డి అనేక పోరాటాలు సాగించారు. అధికారం చేపట్టిన వెంటనే రాయలసీమకు సంపూర్ణంగా సాగనీరు, తాగునీరు అందిస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి మాట తప్పి, మడమ తిప్పారు. రాయలసీమలో ప్రాజెక్టుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారటానికి జగన్మోహన్ రెడ్డి వైఖరే కారణం.చంద్రబాబు నాయుడు రాయలసీమను నిర్లక్ష్యం చేస్తున్నాడని కర్నూల్ లో రాజధాని గాని రాయలసీమ హైకోర్టు ఇవ్వాలని పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయాలని ఆనాడు చంద్రబాబు నాయుడు కూడా రాయలసీమ ఉద్యమ నాయకుల పైన దాదాపు 25 నుంచి 30 కేసులు నమోదు చేశారు. ఇదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కొన్ని కేసులు కొట్టేసి రాయలసీమ కోసం అభివృద్ధి కోసం పోరాటం చేసే నాయకుల కేసులను కొట్టేయలేదు వాళ్ళ రాజకీయ లబ్ధి కోసం రాయలసీమ వాదాన్ని వాడుకుంటున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న వారిని అక్రమంగా అరెస్టులు చేయిస్తూ,బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గం. ప్రజాతంత్ర వాదులంతా బొజ్జా దశరథ రామిరెడ్డి అరెస్టును ఖండించాలని లక్ష్మీ నరసింహ యాదవ్ కోరారు.

# నేడు కెసిఆర్‌ను పరామర్శించ నున్న జగన్.

ఆంధ్ర ప్రగతి అమరావతి జనవరి 03:
తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఈ నెల 4వ తేదీనభేటీకానున్నారు.తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు గత నెల 8వ తేదీన హిప్ రీప్లేస్ మెంట్ సర్జరీ జరిగింది.ఈ సర్జరీ జరిగిన తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యాక తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. శస్త్రచికిత్స తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావునుపరామర్శించనున్నారు జగన్. కేసీఆర్ నివాసంలోనే ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి తిరిగి తాడేపల్లికి చేరుకుంటారు. 2019లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డితో కల్వకుంట్ల తారక రామారావు లోటస్ పాండ్ లో భేటీ అయ్యారు. అయితే మరోసారి 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో జగన్ భేటీ కావాలని నిర్ణయం తీసుకోవడం రాజకీయంగా చర్చకు దారి తీస్తుంది. కేసీఆర్ ను పరామర్శించేందుకే జగన్ కేసీఆర్ తో భేటీ కానున్నారని వైఎస్ఆర్‌సీపీ వర్గాలు చెబుతున్నాయి.అయితే రానున్న రోజుల్లో రాజకీయ పరిణామాలపై ఈ ఇద్దరి నేతల మధ్య చర్చలు జరిగే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# జిల్లాలో 2,24,228 పెన్షన్ దారులకు రూ.66.64 కోట్ల లబ్ది.

## -కొత్తగా 3,171 మంది పెన్షన్ దారులకు రూ.95,13,000/-లు పంపిణీ.

## -జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 03:
పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ జిల్లాలో 2,24,228 పెన్షన్ దారులకు రూ.66.64 కోట్ల లబ్ది చేకూరుస్తున్నామని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్ పేర్కొన్నారు.బుధవారం కాకినాడ నుంచి రాష్ట్రవ్యాప్తంగా జనవరి 1 నుంచి పెంచిన పెన్షన్ల లబ్ధిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి వర్చువల్ విధానంలో లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడు హాబీబుల్లా, మార్క్ఫెడ్ చైర్మన్ పి పి నాగిరెడ్డి, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఏపీఎస్ డిసిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, లబ్ధిదారులు వీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్ మాట్లాడుతూ పేద ప్రజల ఆర్థికాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే వైయస్సార్ పెన్షన్ పథకం కింద జిల్లాలో 2,24,228 పెన్షన్ దారులకు రూ.66.64 కోట్ల లబ్ది చేకూరుస్తున్నామన్నారు. ఈ జనవరి మాసం నుండి కొత్తగా 3,171 మంది పెన్షన్ దారులకు రూ.95,13,000/-లు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. అవ్వ తాతలు, వితంతువులు, వికలాంగులకు ఇకపై ప్రతినెల రూ.2,750 నుంచి రూ.3వేల చొప్పున పెంచిన పెన్షన్ల లబ్ధిని అందజేయడం జరుగుతుందన్నారు.

జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కొత్తగా 554 మంది పెన్షన్ దారులకు రూ.16.62 లక్షలు, బనగానపల్లిలో 566 మంది పెన్షన్ దారులకు రు.16.98 లక్షలు, డోన్ లో 462 మంది పెన్షన్ దారులకు రూ 13.86 లక్షలు., నందికొట్కూర్ లో 487 మంది పెన్షన్ దారులకు రూ.14.61లక్షలు, నంద్యాలలో 567 మంది పెన్షన్ దారులకు రూ.17.01 లక్షలు, పాణ్యంలో 141 మంది పెన్షన్ దారులకు రూ.4.23 లక్షలు, శ్రీశైలంలో 394 మంది పెన్షన్ దారులకు రూ.11.82 లక్షలు, వెరసి మొత్తం 3,171 మంది నూతన పెన్షన్ దారులకు సంబంధించి రూ. 95.13 లక్షల రూపాయలు జనవరి మాసం నుండి అందజేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.



మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడు హాబీబుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పేద ప్రజల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని సర్వీసులను ప్రజల ముంగిటికే తీసుకెళుతున్నట్లు ఆయన తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు, మార్క్ఫెడ్ చైర్మన్ పి పి నాగిరెడ్డి, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్, ఏపీఎస్పిడిసిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి తదితరులు పెన్షన్ దారులకు మెగా చెక్ ను అందచేశారు



# ముస్లిం స్వర్ణకార సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ.

ఆంధ్రప్రగతి నంద్యాల జనవరి03:
నంద్యాలలో ముస్లిం స్వర్ణకార సంఘం నూతన సంవత్సర 2024 క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్ ఖాదిరి,నంద్యాల పట్టణ స్వర్ణకార సంఘ అధ్యక్షులు సెపూరి నాగేంద్ర ప్రసాద్, ముస్లిం స్వర్ణకార సంఘం కర్నూలు జిల్లా మాజీ అధ్యక్షులు ఎన్.ఎం.డి.ఫయాజ్, 39వ వార్డు టిడిపి ఇన్చార్జి జాకీర్ హుస్సేన్, ముస్లిం స్వర్ణకార సంఘం టౌన్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ మునాఫ్, నంద్యాల జిల్లా కన్వీనర్ అమీర్ భాష, సిల్వర్ స్మిత్ అధ్యక్షులు యూసుఫ్ భాష ,డి.ఎస్ ఖాజాముద్దీన్ స్వర్ణకారులు,మొహమ్మద్,జుగును,యాకూబ్,మాలి భాష,డి.ఎస్ రసూల్,గఫార్,ఏ.బి.కరిముల్లా,జమాల్ బాషా, ఉస్మాన్,ఆయుబ్,గారు కలీం బిలాల్ అమీర్,సల్మాన్, అలీమ్,తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ పెన్షన్ కానుక ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:
రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ పెన్షన్ కానుక ఉత్సవాలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ రవి చంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా నంద్యాల శాసనసభ్యులు శిల్పారవిరెడ్డి హాజరయ్యారు. రాష్ట్రంలోని అర్హులైన అవ్వాతాతలకు, అక్కాచెల్లెమ్మలకు, దివ్యాంగులకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ల ద్వారా ఠంచనుగా పెన్షన్ ను లబ్ధిదారుల ఇళ్లకు చేరవేస్తూ వారి జీవితాలకు భరోసాగా నిలుస్తున్నారన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి దశల వారిగా అర్హులైన అవ్వాతాతలకు, అక్కాచెల్లెమ్మలకు, దివ్యాగులకు ఠంచనుగా పెన్షన్లు అందించడం జరుగుతుందన్నారు. నాడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ప్రత్యక్ష్యంగా అవ్వాతాతల, అక్కాచెల్లెమ్మల, దివ్యాగుల కష్టాలను, కడగండ్లను విని, చూసి వారి కన్నీళ్లను కష్టాలను తీరుస్తానని ఇచ్చిన హామీల మేరకు జగనన్న తూచాతప్పకుండా ఇచ్చిన మాటప్రకారం దశలవారిగా పెన్షన్ ను పెంచుతూ ఈ సంవత్సరం నుండి ప్రతి నెల 3వేల రూపాయలను లబ్ధిదారులు ఇళ్ల వద్దకు అందిస్తున్నారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కేవలం అధికారం చేపట్టిన నాలుగున ర సంవత్సరాల కాలంలో చేపట్టడం ఒక చారిత్రాత్మకం అన్నారు.





అలాగే రాష్ట్రంలో నవరత్నాలను అమలు చేసి సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించారని తెలిపారు. ఇటువంటి మనసున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రతి ఒక్కరు ఆశీర్వదించాలని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో తనను ఎమ్మెల్యే గా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి జగనే పెద్ద అరిష్టం.. రాజకీయాలను అపవిత్రం చేశాడు

45 ఏళ్లుగా నేను రాజకీయాల్లో ఉన్నా..1978లో మొదటిసారి ఎమ్మెల్యే అయ్యాను. ఎంతోమంది సీఎంలను చూశాను గానీ జగన్ లాంటి దారుణమైన ముఖ్యమంత్రిని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. జగన్ సీఎం అయ్యాక రూ.12 లక్షల కోట్లు అప్పులు చేశారు.. 75 ఏళ్లుగా అభివృద్ధి చేసిన వ్యవస్థలను జగన్ విధ్వంసం చేశాడు. రాష్ట్రంలో రోడ్లు, వ్యవసాయం, విద్య, వైద్యం అన్నీ దెబ్బతిన్నాయి. వైసీపీ నేతల అవినీతి, అక్రమాలపై ఎవరు మాట్లాడినా దాడులు చేసి కేసులు పెట్టారు. ఎక్కడ చూసినా దందాలు, దోపిడీలే. ప్రజలు అసహ్యించుకుంటుంటే జగన్ కొత్తగా ఆలోచించి ఎమ్మెల్యేలను మార్చుతున్నాడు. ఐదేళ్లుగా మీ ఎమ్మెల్యేలు తప్పు చేసి, ప్రజల మద్ధతు కోల్పోతే నీ ఇంటెలిజెన్స్ ఏమి చేసింది.? తప్పు చేసిన ఎమ్మెల్యేలను ఎప్పుడైనా పిలిచి మాట్లాడారా.? ఇది తప్పు అని చెప్పారా.? వాళ్లకు దొరికింది వాళ్లు దోచుకున్నారు. నువ్వు చేసిన సర్వేలో నువ్వే లాభం లేదని అనుకుంటున్నారు జగన్. పరిశ్రమలు తరిమేశాడు. రోడ్లన్నీ పాడైపోయాయి. ఏ ప్రాజెక్టూ పూర్తి చేయలేదు..విపరీతంగా అప్పులు చేశాడు. ఇష్టారీతిన అవినీతి చేసి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. జగన్ రాజకీయాలను అపవిత్రం చేశాడు. మంచి, చెడుకు తేడా తెలియని వ్యక్తి జగన్. రాష్ట్రాన్ని జగన్ గందరగోళంలోకి నెట్టారు. వ్యవస్థలు సక్రమంగా ఉండి..నడిపించే వ్యక్తులు సమర్థులుగా ఉంటే దాని ఫలితాలు సామాన్యులకు దక్కుతాయి. స్కూలు బిల్డింగులకు రంగులు వేయడంఅభివృద్ధికాదు...చదువుకున్న విద్యార్థి మేధావి అయి, మంచి ఉద్యోగం సాధిస్తే అది నిజమైన అభివృద్ధి. పైపైన రంగులు దుద్ది అదే అభివృద్ధి అని చెప్తున్నారు. సంక్షేమ కార్యక్రమాలు టీడీపీ కూడా ఇచ్చింది..మేం ప్రవేశపెట్టిన 100 సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసింది. స్కాలర్ షిప్ లు టీడీపీ హయాంలో 16 లక్షల మందికి ఇస్తే..దానికి విద్యా దీవెన అని పేరు పెట్టి 10 లక్షలకు కుదించి బటన్ నొక్కుతూ సొంత పత్రికకు ప్రకటనలిచ్చుకుంటున్నాడు. చదువుకోవాలనుకునే ప్రతి విద్యార్థికీ విదేశాల్లోనూ చదువుకునే అవకాశం కల్పిస్తేనే నిజమైన విద్యాభివృద్ధి..అదే టీడీపీ చేసి చూపింది. విదేశీ విద్య కింద ఒక్కో విద్యార్థికి రూ.15 లక్షలు ఆర్థిక సాయం అందించాం. భయంకరంగా జగన్ తన పార్టీ ఎమ్మెల్యేలను మార్చుతున్నారు. నా జీవితంలో ఇంతలా మార్పులు వినలేదు..చూడలేదు. రాజకీయాల్లోకి వచ్చేది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి..జవాబుదారీ తనం తీసుకురావడానికి. ప్రజాప్రతినిధి అనేవాడు ప్రజల్ని లీడ్ చేయాలి. పుచ్చలపల్లి సుందరయ్యను ప్రజలు ఇప్పుడూ గుర్తుంచుకుంటున్నారు.

తెలుగుజాతి బతికున్నంతకాలం గుర్తుండే వ్యక్తి ఎన్టీఆర్. 60 ఏళ్ల వయసు తర్వాత ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చారు..ఆయన జీవితం ఒక ఆదర్శం. పదవి, డబ్బులు కోసం ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాలేదు. తనను ఆదరించిన ప్రజలకు సేవ చేయాలని, నీతివంతమైన రాజకీయం చేయాలని వచ్చి రాజకీయాలకే నూతన నిర్వచనం నేర్పించారు ఎన్టీఆర్. అభివృద్ధి-సంక్షేమాన్ని పద్ధతిప్రకారం నడిపించారు. రిషికొండ లాంటి చారిత్రక కొండను తవ్వేసి, ప్యాలెస్ కట్టేశాడు. ఈయనే సీఎంగా శాశ్వతంగా ఉంటాడనుకున్నారు. రూ.500 కోట్లు పెట్టి ప్యాలెస్ కట్టుకుని ఏ విధంగా సమర్థించుకుంటావు.? మా ఇంటికి వంద గజాల చిన్న రోడ్డు వేస్తే ప్రతి రోజూ విమర్శించిన వ్యక్తి...తన ఇంటికి 4 లైన్ల రోడ్డు వేసుకున్నాడు. రాజధాని విశాఖ తీసుకెళ్తానంటే కోర్టులు కూడా మొట్టికాయలు వేశాయి. అమరావతి అంశాన్ని ఏప్రిల్ లో వింటామని సుప్రీంకోర్టు చెప్పింది..అప్పటికి జగన్ ఉండరు..మళ్లీ టీడీపీనే వస్తుంది. నువ్వు రాజధాని మార్చలేవు..విశాఖ పోలేవు. కానీ రాజధాని పేరుతో విశాఖ ప్రజలను మోసం చేశావు. సాధ్యం కాదని తెలిసి కూడా వందల కోట్లు లాయర్లకు విచ్చలవిడిగా డబ్బులిచ్చి దుర్వినియోగం చేశాడు.

మొన్న 11 మందిని, నిన్న 27 మందిని మార్చాడు. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనారిటీలు అంటాడు..కానీ వారినే మార్చాడు. నేను పుల్లను నిలబెట్టినా గెలుస్తారు అన్నావ్ కదా...మరి ఇప్పుడున్నవాళ్లను పెట్టి ఎందుకు గెలిపించలేవు.?. సీఎం పదవి కోసం నేను ప్రయత్నం చేయడం లేదు. టీడీపీ-జనసేన అధికారం కోసం ప్రయత్నం చేయడం లేదు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం పోరాటం చేస్తున్నాం. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలొచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రానికి ఎవరన్నా రావాలన్నా భయపడిపోతున్నారు. ఆస్తులను రాసిస్తావా లేదా అని మెడపై కత్తిపెట్టి రాయించుకుంటున్నారు. విశాఖలో యువతిపై 11 మంది గ్యాంగ్ రేప్ కు పాల్పడ్డారు..అసలు రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా.? శాంతి భద్రతల గురించి సీఎం పట్టించుకుంటున్నాడా.? నేను సీఎంగా ఉన్నప్పుడు పిడుగురాళ్లలో అత్యాచారం జరిగితే టాస్క్ ఫోర్స్ కమిటీ వేసి నిందితుడు భూమ్మీద ఎక్కడున్నా పట్టుకురమ్మంటే..విషయం తెలుసుకున్న నిందితుడు తెలుసుకుని ఉరేసుకుని చనిపోయాడు. పాలకులు సమర్థులుగా ఉంటే మిగిలిన వాళు ఒళ్లు దగ్గరపెట్టుకుని పని చేస్తారు. డ్రగ్స్ గురించి మాట్లాడితే విమర్శలు చేస్తారా అని టీడీపీ కార్యాలయంపై దాడి చేశారు. రాష్ట్రంలో పండిన గంజాయి పక్క రాష్ట్రాలకు వెళ్లడంతో వాళ్లూ ఏపీని తిడుతున్నారు. బాధ్యత కలిగిన నాయకులందరూ ఆలోచించాలి. మనం చూసుకుంటూ కూర్చుంటే రాష్ట్రంలో ఏమీ మిగలదు. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ నెల 5వ తేదీ నుండి రా..కదలిరా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను. ప్రజలకు ఏమి చేస్తానో చెప్పేందుకు 25 పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తా. రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన వ్యక్తి పట్ల జాగ్రత్తగా ఉండాలి. అంగన్వాడీ, ఆశావర్కర్లు, పారిశుధ్య కార్మికులు, గురుకులాల సిబ్బంది రోడ్లపైకి వస్తే వాళ్లని బెదిరిస్తున్నారు. న్యాయమైన కోరికల కోసం ఆందోళన చేస్తే సమర్థిస్తాం..వాటిని పరిష్కరించేందుకు ముందుకొస్తాం.” అని చంద్రబాబు నాయుడు అన్నారు. అంతకముందు పార్టీలో చేరిన వారిలో చీరాలకు చెందిన క్రీడా మాజీ అధికారి నక్కల అర్జున రావు, హైకోర్టు న్యాయవాది సింగయ్య గౌడ్, పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లతో మరికొందరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందిరినీ చంద్రబాబు నాయుడు పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఉండవల్లి శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యేలు, పీలా గోవింద్, ప్రభాకర్ చౌదరి, లింగారెడ్డి, యరపతినేని శ్రీనివాస్, కాల్వ శ్రీనివాసులు, పుట్టా సుధాకర్ యాదవ్, చీరాల ఇంఛార్జ్ మాలకొండయ్య యాదవ్, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి, శ్రీరామ్ చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీ నెరవేరుస్తూ.. వృద్ధాప్య పెన్షన్‌ను 3 వేలకు పెంచి ఇస్తున్నాం.. సీఎం జగన్

నేడు మీ బిడ్డ ప్రభుత్వంలో 64.34 లక్షల మందికి పింఛన్ల కోసం చేస్తున్న ఖర్చు నెల నెల అక్షరాలు దాదాపుగా రూ.2 వేల కోట్లు అని సీఎం జగన్ అన్నారు. ప్రతి నెలా 1వ తారీఖున పండుగైనా, సెలవు, ఆదివారం అయినా సరే మీ జగనన్న సైన్యం, నా వాలంటీర్లు మాత్రం అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు చూసే రోజని అన్నారు. గ్రామాల్లో గ్రామ సచివాలయ వ్యవస్థ వచ్చిందని, కులం, మతం, ప్రాంతం,వర్గం చూడటం లేదని, చివరికి ఏ పార్టీ అని చెప్పి ఎవరూ అడగడం లేదని, అర్హత ఉంటే చాలు మీ కష్టం నా కష్టంగా భావించి ఈ రోజు ప్రతి ఒక్కరికి తోడుగా అండగా నిలబడే కార్యక్రమం ఈ రోజు మీ బిడ్డ పాలనలోనే జరుగుతుందని సీఎం పేర్కొన్నారు.

ఇంత మంచి కార్యక్రమం జరుగుతున్న పరిస్థితిలో ఒక్కసారి గతానికి అంటే ఐదేళ్ల క్రితం పరిస్థితి గమనించాలని, అప్పట్లో చంద్రబాబు పరిపాలనలో ఎన్నికలకు రెండు నెలల ముందు కూడా పింఛన్ కేవలం రూ.1000 మాత్రమే ఇచ్చాడని ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ఆనాడు కూడా ఆ ఎన్నికలకు రెండు నెలల ముందు పింఛన్ రూ.2 వేలు చేశాడని,ఎన్నికలు రాకపోయి ఉంటే..మీ బిడ్డ జగన్ రూ.2 వేలు ఇస్తానని చెప్పకపోయి ఉంటే ఆ పింఛన్ పెంచేవాడా?అని సీఎం ప్రశ్నించారు. గత ఐదేళ్ల చంద్రబాబు పాలనలో యావరేజ్ కింద పింఛన్ కేవలం రూ.58 వేలు ఇస్తే మీ బిడ్డ పాలనలో అవ్వాతాతల చేతుల్లో ఈ నాలుగున్నరేళ్ల పాలనలో అక్షరాల రూ.1.47 లక్షలు ఇచ్చామని తెలిపారు. వికలాంగులను లెక్కల్లో వేసుకుంటే వారికి రూ.1.82 లక్షలు ఇచ్చామని, గతానికి ఇప్పటికి మధ్య తేడా గమనించాలని సీఎం కోరారు.

గతంలో పెంఛన్ కావాలంటే పడిగాపులు పడాలని, పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదాని, పింఛన్ తీసుకోవాలంటే లైన్లలో నిలబడాలని గురక్తు చేశారు. ఒకవైపు లంచాలు, మరోవైపు వివక్ష, మరో వైపు చెంతాడంత క్యూలైన్లు, ఈ రోజు ఎవరికి పింఛన్ కావాలన్నా అర్హత ఉంటే చాలు మంజూరు చేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.చంద్రబాబు అవినీతిలో పవన్ కల్యాణ్ కూడా భాగస్వామి. చంద్రబాబు అవినీతిపై పచ్చ మీడియా ఏమీ రాయవు, చూపించవన్నారు. ఐదేళ్లు గతంలో సీఎంగా ఉన్న ఒకాయనకు ఒక దత్తపుత్రుడు ఉన్నాడని, ఆ ఇద్దరు కలిసి 2014లో ఎన్నికల ప్రణాళికలో వాళ్లు చెప్పిన మాట ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలం, అందులో ఇళ్లు కట్టిస్తామని వాగ్దానం చేశారని, చివరకు ఒక్క సెంట్ కూడా ఇవ్వలేదని సీఎం గుర్తు చేశారు. అడ్డగోలుగా దత్తతండ్రి మోసం చేస్తే..ఈ దత్తపుత్రుడు కనీసం ప్రశ్నించలేదని కానీసం కేంద్రానికి ఒక లేఖ కూడా రాయలేదని సీఎం దుయ్యబట్టారుకానీ, నేడు. మీ బిడ్డ అక్కచెల్లెమ్మలకు వారి కుటుంబాలకు మంచి చేయాలని మీ బిడ్డ పరుగెత్తుంటే. . అక్షరాల 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి మీ ముఖాల్లో సంతోషం చూస్తుంటే.. ఇదే దత్తపుత్రుడు ఇవాళ కేంద్రానికి లేఖలు రాస్తున్నాడని ఎద్దేవా చేశారు. పేదలకు కట్టే ఇళ్లలో అవినీతి జరిగిందని కేంద్రానికి లేఖలు రాసి ఇంటి నిర్మాణాలు ఆపాలని చూసిన దిక్కుమాలిన వ్యక్తి ఈ అన్యాయస్థులేనని మండిపడ్డారు.

చంద్రబాబు అవినీతిని కేంద్ర దర్యాప్తు సంస్థలు నిర్ధారించి న్యాయస్థానం జైలుకు పంపిందని, జైల్లో ఉన్న అవినీతిపరుడు చంద్రబాబును దత్తపుత్రుడు పరామర్శిస్తాడని. అవినీతికి తావులేకుండా పాలన చేస్తున్న మన ప్రభుత్వంపై విమర్శలు చేస్తాడని, చంద్రబాబు అవినీతిలో భాగస్వామి కాబట్టే దత్తపుత్రుడు ప్రశ్నించడని విమర్శించారు.

రాబోయే రోజుల్లో కుట్రలకు తెరతీస్తారని, రాబోయే రోజుల్లో పొత్తులు ఎక్కువగా పెట్టుకుంటారని, కుటుంబాలను చీల్చి రాజకీయాలు చేస్తారని, మీరందరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం జగన్ సూచించారు. “చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అమ్మ ఒడి స్కీమే లేదు.ఈ ఒక్క స్కీమ్‌ద్వారా ఈ ఐదేళ్లలో మీ బిడ్డ 44.49 లక్షల మంది నా అక్కచెల్లెమ్మలకు మేలు చేస్తూ ..అక్షరాల మీ బిడ్డ బటన్ నొక్కడం నేరుగా రూ.26 వేల కోట్లు మీ ఖాతాల్లోకి జమ చేశాను. మారిందల్లా కేవలం ఒకే ఒక వ్యక్తి ముఖ్యమంత్రి మాత్రమే మారారు. నా అక్కచెల్లెమ్మలకు అమ్మ ఒడి డబ్బులు ఇచ్చాను. చంద్రబాబు సీఎంగా ఉండగా రైతు భరోసా అనే స్కీమే లేదు.ఆ ఐదేళ్లు రైతు భరోసా స్కీమే లేదు. ఇవాళ ప్రతి ఏడాది అక్షరాల రూ.53.57 లక్షల మంది రైతులకు మీ బిడ్డ బటన్ నొక్కడం నేరుగా నా రైతన్నల ఖాతాల్లో ప్రతి ఏటా రూ.13,500 జమ చేస్తున్నాం. ఈ స్కీమ్ ద్వారా ఈ ఐదేళ్లలో రూ.33,300 కోట్లు మీ బిడ్డ ఇచ్చాడు. మారిందల్లా కేవలం ఒకే ఒక వ్యక్తి. ముఖ్యమంత్రి మాత్రమే మారారు.

అదేరాష్ట్రం, అదే బడ్జెట్. ఆలోచన చేయండి. చంద్రబాబు సీఎంగా ఉండగా వైయస్ఆర్ ఆసరా అనే స్కీమే లేదు. ఈ ఒక్క పథకం ద్వారా అక్షరాల 78.94 లక్షల మంది పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు ఈ 55 నెలల్లో నేరుగా మీ బిడ్డ బటన్ నొక్కి రూ.19,178కోట్లు నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశాను. చంద్రబాబు సీఎంగా ఉండగా వైయస్ఆర్ చేయూత అనే స్కీమే లేదు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉన్న నా అక్కచెల్లెమ్మల బాగోగులు పట్టించుకున్న నాథుడే లేదు. వాళ్లు బాగుంటే వాళ్ల కుటుంబాలు బాగుంటాయని నమ్మిన మీ బిడ్డ నాఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ తోడుగా ఉంటూ ప్రతి ఏటా రూ. 18,500 డబ్బులు ఇస్తున్నాను. 26.48 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు మంచి చేస్తూ ..నేరుగా బటన్ నొక్కి రూ.14,169 కోట్లు జమ చేశాను. వైయస్ఆర్ నేతన్న నేస్తం ద్వారా రూ.982 కోట్లు నా నిరుపేద నేతన్నలకు అండగా నిలబడ్డాను. వైయస్ఆర్ వాహన మిత్ర ద్వారా నా డ్రైవర్ అన్నదమ్ములకు రూ.1302 కోట్లు నేరుగా జమ చేశాను.

ఈబీసీ నేస్తం ద్వారా రూ.1252 కోట్లు నా నిరుపేద అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశాను. అగ్రిగోల్డ్ బాధితులకు రూ.905 కోట్లు ఇచ్చాం. జగనన్న తోడు ద్వారా రూ.2,955 కోట్లు, జగనన్న చేదోడు ద్వారా రూ.1250 కోట్లు ఇచ్చాం. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్ చెంతాడంత ఉంటుంది. ఆలోచన చేయండి. ఎక్కడైనా కూడా లంచాలు, వివక్ష లేదు. ప్రతిదీ కూడా గ్రామ పంచాయతీలో లిస్టు పెడుతున్నాం. వాలంటీర్లు మీ ఇంటికి వచ్చి తోడుగా నిలబడుతున్నాడు. నేరుగా డబ్బులు పంపిస్తున్న ప్రభుత్వం మీ బిడ్డ పాలనలోనే జరుగుతుంది. ప్రతి విషయం కూడా ఆలోచన చేయాలి” అని సీఎం సూచించారు

# కుమారుడి వివాహ పత్రికను అన్న వదినలకు అందించిన షర్మిల.

ఆంధ్ర ప్రగతి తాడేపల్లి జనవరి 03:
షర్మిల తన కుమారుడు రాజారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను వైఎస్ జగన్, తన వదిన వైఎస్ భారతిలకు షర్మిల అందించారు.
సుదీర్ఘ విరామం తర్వాత వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల తన అన్న, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ను కలిశారు. జనవరి 3 సాయంత్రం తాడేపల్లిలోని సీఎం జగన్ నివాసానికి వెళ్లిన షర్మిల ఆయనతో సమావేశమయ్యారు. అంతకుముందు కడప నుంచి ప్రత్యేక విమానంలో షర్మిల కుటుంబ సభ్యులు గన్నవరం విమానాశ్రయం చేరుకున్నారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో తాడేపల్లికి బయలుదేరారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను వైఎస్ జగన్, తన వదిన వైఎస్ భారతిలకు షర్మిల అందించారు.తాడేపల్లికి షర్మిలతో పాటు వెళ్లినవారిలో ఆమె కుమారుడు రాజారెడ్డి, కాబోయే కోడలు అట్లూరి ప్రియ ఉన్నారు. షర్మిలతోపాటు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా ఉన్నారని చెబుతున్నారు.కాగా వధూవరుల నిశ్చితార్థం, పెళ్లి తేదీలను వైఎస్ షర్మిల తన అన్న, వదినలకు వెల్లడించారు. ఈ రెండు కార్యక్రమాలకు రావాలని వారిని ఆహ్వానించారు. రాజారెడ్డికి అట్లూరి ప్రియతో జనవరి 18న నిశ్చితార్థం, ఫిబ్రవరి 17న పెళ్లి జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.జగన్ నివాసంలో షర్మిల దాదాపు అరగంట పాటు ఉన్నట్లు సమాచారం. జగన్ దంపతులకు శుభలేఖను అందించిన తర్వాత షర్మిల ఢిల్లీకి బయలుదేరారు. జనవరి 4న ఆమె కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో సమావేశం కానున్నారు. ఇప్పటికే షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు స్వయంగా ప్రకటించిన సంగతి తెలిసిందే.
కాగా వైఎస్ షర్మిల వెంట కడపకు వచ్చిన ఆమె తల్లి వైఎస్ విజయమ్మ.. ఆ తర్వాత షర్మిలతో కలిసి జగన్ వద్దకు మాత్రం వెళ్లలేదు. కడప నుంచి తిరిగి



హైదరాబాద్ వెళ్లిపోయారు. షర్మిల వెంట జగన్ ఇంటికి విజయమ్మ కూడా వెళ్తుందని అందరూ భావించారు. అయితే, ఆమె అక్కడకు వెళ్లలేదు.
కాగా షర్మిల, జగన్ భేటీలో రాజకీయ పరమైన చర్చలేమీ జరగలేదని అంటున్నారు. కేవలం తన కుమారుడి పెళ్లి విషయం మాత్రమే ఆమె మాట్లాడరని చెబుతున్నారు.

# అంగన్వాడి సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం. సిఐటియు

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:
న్యాయమైన అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం అని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి యేసురత్నం ఏ నాగరాజు లు పులుపునిచ్చారు అంగన్వాడీలు నిరవధిక సమ్మె 23వ రోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా సందర్భంగా నంద్యాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయం నుండి 2500 మంది అంగన్వాడీ టీచర్లు ఆయాలు భారీ ర్యాలీ నూనె పల్లె ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదనుండి నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందున్న జాతీయ రహదారిపై ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ ధర్నాకు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు డి నిర్మలమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి ఏసురత్నం ఏ నాగరాజును పాల్గొని మాట్లాడుతూ.. న్యాయమైన అంగన్వాడీల డిమాండ్లు పరిష్కారం కాకపోతే అవసరమైతే నిరవధిక దీక్షలు కోరుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు
సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె 23వ రోజు చేరుకుందని అంగన్వాడీల పట్ల ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు మొండిగా,నిరంకుసత్వంగా వ్యవహరిస్తున్నారని
విమర్శించారు.మాది సంక్షేమ ప్రభుత్వం,మహిళా పక్షపాత ప్రభుత్వం అని చెప్పుకునే ముఖ్యమంత్రి గారు 23 రోజుల నుండి లక్ష మందికి పైగా మహిళలు రోడ్డెక్కి ఆర్తనాదాలు పెడుతుంటే వినపడడం లేదా అని ప్రశ్నించారు.ఎమ్మెల్యేలను, మంత్రులను అడ్డుకున్నా,వారి ఇళ్ళను ముట్టడించినా చలనం లేదా అని ఎద్దేవా చేశారు.ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పోల్చితే వస్తున్న వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని వేతనాలు పెంచాలని అడుగుతున్నామని ప్రభుత్వమేమో వేతనాలు ఎప్పుడో పెంచాం సమస్యలన్నీ పరిష్కరించామని అబద్ధాలు ప్రచారం చేయడం దారుణం అన్నారు.మరోవైపు చీపుర్లు, బకెట్లు,మగ్గులు,ఫినాయిల్ ఇచ్చాం కదా,గోడలకు




సున్నం కూడా వేయిస్తున్నాం కదా సమ్మె విరమించండి అని అడుగుతున్న ఇటువంటి దౌర్భాగ్య ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడైనా ఉంటుందా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.అవి ఇచ్చేది సెంటర్ల నిర్వహణ కోసం అని వాటితో మా కడుపులు నిండుతాయా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానం ప్రకారం తెలంగాణలో ఇప్పుడున్న వేతనాల కన్నా వెయ్యి రూపాయలు అదనంగా ఇవ్వాలన్నారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు.మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు.2017 నుండి టిఏలు,డిఏలు చెల్లించాలన్నారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షభ నిర్మలమ్మ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు కే ఎం డి గౌస్ భాస్కర్ రెడ్డి సిఐటియు జిల్లా కార్యదర్శి వి బాల వెంకట్, ఎల్లయ్య, లక్ష్మణ్ ,నరసింహ, రత్నమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులకు దిగుతుందని ఇలాంటి తాటాకు చప్పులకు అంగన్వాడీలు భయపడే ప్రసక్తే లేదని న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. అలాగే ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి రాజ్యలక్ష్మి నాగరాణి సునీత హరిత సులోచనమ్మ రోజా రమణి శివలక్ష్మి మంజుల నాగమణి వెంకటరమణమ్మ సరోజాలు లు దేశించి మాట్లాడుతూ రకరకాల యాప్ లను రద్దుచేసి ఓకే యాప్ ద్వారా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ రెండు హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ నాయకురాలు ఉదయలక్ష్మి నాగరాణి భాగ్యమ్మ శ్రీదేవి శివలక్ష్మి పద్మ నాగమణి నాగలక్ష్మి వసంత వెంకటమ్మలు పుష్పలత లు నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.



# వికసిత్ భారత్ ద్వారా కేంద్ర పథకాలను వివరిస్తున్నాం

అమరావతి,జనవరి3(ఆర్ఎన్ఎ):రాబోయే ఎన్నికలకు ఈ సమావేశం చివరిది.. ఎన్నికలకు సమాయత్తయ్యేలా సమావేశాలు ఉంటాయని తెలిపారు బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి.. విజయవాడలో బీజేపీ రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ఇన్చార్జీల సమావేశం ప్రారంభం అయ్యింది.. ఈ కీలక సమావేశాల్లో మాట్లాడిన ఆమె.. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ జెండా రెపరెపలాడుతుంది.. కొన్ని చోట్ల అధికారం పంచుకుంటుంది అన్నారు. ఇక, ఏపీ చేసిన మేలు ప్రజలకు వివరించే బాధ్యత పదాధికారులదే అన్నారు. వికసిత్ భారత్ ద్వారా కేంద్ర పథకాలను వివరిస్తున్నాం అన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా ఇవి కేంద్ర పథకాలను ప్రజలు తెలుసుకుంటున్నారు. పదేళ్లలో ప్రజలకు ఏం చేసేమో మనమే చెప్పాలి. రాష్ట్ర పరిస్థితులను మనం బేరీజు చేసుకోవాలి అన్నారు. ఇక, టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.3 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆ అప్పులను రూ. 12 లక్షల కోట్లకు పైగా తీసుకెళ్లి రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేసిందని మండిపడ్డారు పురంధేశ్వరి.. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది. జగన్ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం వెనుక ఒక స్కాం ఉందని ఆరోపించారు. డబ్బులు వేస్తూనే ప్రతి పథకంలో తమ వాటా ఉండే విధంగా అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు.. రైతాంగం నైరాశ్యంలో కూరుకుపోయింది. మొన్న తుఫాను దాటికి రైతాంగం అనేక ఇబ్బందులు పడ్డారు. రైతు పార్టీ అని చెప్పుకునే వైసీపీ రైతాంగానికి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు, విశాఖలో మహిళపై పాశవికంగా అత్యాచారం చేయడం దుర్మార్గం అన్నారు పురంధేశ్వరి.. దిశ యాప్ ఉందని సీఎం గొప్పగా చెబుతున్నారు.. మహిళలు ఫోన్ ఊపుతూనే ఉన్నారే తప్ప మహిళలకు రక్షణ కొరవడిందని దుయ్యబట్టారు. ఇక, రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు రాలేదు. ఐదు లక్షల ఉద్యోగాలిస్తానని జగన్ హామీ ఇచ్చారు.. ఏమైంది ఆ మాట..? అని నిలదీశారు. ఎస్సీ నియోజకవర్గాల్లోనూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటి వాళ్లు పెత్తనం చెలాయిస్తున్నారు. రిజర్వేషన్ ఉంది కాబట్టి ఎమ్మెల్యేగా అవకాశ మిచ్చారని వైసీపీ నేతలే ఆవేదన వ్యక్తం చేస్తున్నారని గుర్తుచేశారు దగ్గుబాటి పురంధేశ్వరి

# ఏపీలో పొత్తులతో వెళ్లాలా..? లేదంటే ఒంటరిగా వెళ్లాలా...?

ఆంధ్ర ప్రగతి అమరావతి జనవరి 03:
వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోను అధికారాన్ని కైవసం చేసుకోవాలనే ధృక్పథంతో తెలుగుదేశం పార్టీ వ్యూహాలు రచిస్తూ ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగానే జనసేనతో పొత్తు పెట్టుకుంది. భారతీయ జనతాపార్టీని కూడా కలిసిరావాలని కోరుతోందికానీ ఆ పార్టీ అగ్రనాయకత్వం స్పందన ఏమిటనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. సంక్రాంతికల్లా బీజేపీ నుంచి సానుకూల స్పందన వచ్చే అవకాశం ఉందని చంద్రబాబు, పవన్ కల్యాణ్ అంచనా వేస్తున్నారు.ఈరోజు బీజేపీ జిల్లాల అధ్యక్షులు, పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహాన్ని ఢిల్లీ నాయకత్వానికి అప్పగించారు. రేపు పార్టీ కోర్ కమిటీ సమావేశం జరగబోతోంది. దీనికి పార్టీ నేత తరుణ్ ఛుగ్ హాజరు కానున్నారు. ఏపీలో వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీద్వారా అడుగు పెడుతుండటంతో బీజేపీ అప్రమత్తమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలపడనివ్వకుండా చూడటానికి వ్యూహాలు రచిస్తోంది. పొత్తులపై పార్టీ నేతల అభిప్రాయాలను తరుణ్ ఛుగ్ సేకరించనున్నారు. జనసేనతో మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఇరుపార్టీలు సమైక్యంగా ఒక్క కార్యక్రమాన్నీ నిర్వహించకపోవడానికి కారణాలను కూడా ఆయన విశ్లేషించనున్నారు.
ఏపీలో పొత్తులతో వెళ్లాలా? లేదంటే ఒంటరిగా వెళ్లాలా? అన్న విషయంపై పార్టీ నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపి ఢిల్లీ నాయకత్వానికి తరుణ్ ఛుగ్ నివేదిక ఇవ్వనున్నారు. బీసీ ముఖ్యమంత్రి అనే నినాదంతో ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో ఆ పార్టీ ఉంది. అయితే పొత్తులవల్ల ఎవరికి లాభం? బీజేపీకి ఎంతవరకు మేలు కలుగుతుంది? కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏమిటి? అనే విషయాలను అంచనావేసి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. పొత్తుకు అగ్రనాయకత్వం సుముఖంగా లేకపోతే జనసేన వైఖరి ఎలా ఉండబోతోంది? అనే విషయాన్ని కూడా విశ్లేషించనున్నారు. తరుణ్ ఛుగ్ ఇచ్చే నివేదికను బట్టి బీజేపీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకుంటుంది. అయితే చివరగా నరేంద్రమోడీ, అమిత్ షా నిర్ణయమే ఫైనల్ అవుతుంది. రానున్న రెండుమూడు రోజుల్లో పొత్తులకు సంబంధించి ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మరింతగా పెరిగిన చలి..

## -ఆ రాష్ట్రాల్లో పరిస్థితి ఇదే!

న్యూఢిల్లీ, జనవరి 3 :
ఉత్తరాది రాష్టాల్లో్ర చలి మరింతగా పెరిగింది. దట్టమైన పొగమం చు కూడా కమ్ముకుంటోంది. జమ్మూ కాశ్మీర్ నుండి బీహార్, పంజాబ్ వరకు, హర్యానా నుండి తూ ర్పు ఉత్తరప్రదేశ్ వరకు చలి తీవ్రత మరింతగా పెరిగింది. హిమాచల్లోని కుకుమ్సేరిలో ఉష్ణోగ్రత లు మైనస్ 7.5 డిగ్రీల సెల్సియస్కు పడిపోయాయి. పహల్గామ్లో మైనస్ 6.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పర్వతప్రాంతాల్లో కురుస్తున్న హిమపాతం కారణంగా, దేశ రాజధాని, దాని పరిసర ప్రాంతాలలో మంగళవారం రోజంతా చలిగాలులు కొనసాగాయి. ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 8.3 డిగ్రీల సెల్సియస్కు పడిపోయింది. ఇది సాధారణం కంటే ఒక డిగ్రీ ఎక్కువ. ఉత్తర భారతదేశంలో పొగమం చు ట్రాఫిక్కు ఇబ్బందికరంగా మారింది.జనవరి 5 నుంచి 11వ తేదీ వరకూ రాత్రి ఉష్ణోగ్రతలు మరిం తగా తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ (ఐఎండీ) డాక్టర్ మృత్యుం జయ్ మహపాత్ర తెలిపారు. దీని ప్రభావంతో మధ్య భారతదేశంలో చలిగాలుల పరిస్థితి తీవ్రంగా మారవచ్చు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని ఉత్తర భాగం, ఉత్తరప్రదేశ్లోని దక్షిణ భాగంలో పగటి ఉష్ణోగ్రతలు కూడా దిగజారే అవకాశాలున్నాయి. ఎత్తయిన పర్వత శిఖరాలపై మంచు కురుస్తుండ టంతో కాశ్మీర్ లోయ తీవ్రమైన చలిలో చిక్కుకుంది. జమ్మూ కాశ్మీర్లో పొగమంచు కారణంగా రైలు, విమాన సర్వీసులు దెబ్బతింటున్నాయి. శ్రీనగర్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం జనవరి 4, 5 తేదీలలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలతో పాటు మంచు కురిసే అవకాశం ఉంది. జనవరి 8న కూడా ఇలాంటి వాతావరణ పరిస్థితులే ఉండనున్నాయి.

# మహిళలపై నేరాలలో ఉత్తరప్రదేశ్ టాప్

న్యూ ఢిల్లీ, జనవరి 3 :
దేశంలో మహిళలపై అత్యధిక నేరాలు ఉత్తరప్రదేశ్లోనే జరుగు తున్నాయి. దేశం మొత్తం మహిళలపైన జరిగిన నేరాల్లో 55 శాతం ఒక్క యూపీ లోనే జరిగాయి. ఈ మేరకు జాతీయ మహిళా కమిషన్ (ఎన్సిడబ్ల్యు) గతేడాది మహిళలపై నేరాలకు సంబంధించి నివేదిక విడుదల చేసింది. దేశం మొత్తం మహిళలపై నేరాలకు సంబంధించి 28,811 ఫిర్యాదులు నమోదయ్యాయని, అందులో 55 శాతం ఉత్తరప్రదేశ్కు చెందినవని పేర్కొంది.ఎన్సిడబ్ల్యు డేటా ప్రకారం.. గృహ హింస కాకుండా వేధింపులతో కూడిన గౌరవ హక్కు కేటగిరిలో అత్యధిక సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. వేధింపులతో కూడిన గౌరవ హక్కు 8,540 కేసులు నమోదయ్యాయి. దీని తర్వాత గృహ హింసపై 6,274 ఫిర్యాదులు అందాయి. వరకట్న వేధింపుల ఫిర్యాదులు 4,797, వేధింపుల ఫిర్యాదులు 2,349, మహిళలపై పోలీసు ఉదాసీనత 1,618, అత్యాచారం, అత్యాచారానికి ప్రయత్నించిన ఫిర్యాదులు 1,537గా నమోదయ్యాయి. లైంగిక వేధింపులపై 805 ఫిర్యాదులు, సైబర్ క్రైమ్లపై 605, స్టాకింగ్పై 472, గౌరవ నేరాలకు సంబంధించి 409 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్లో అత్యధికంగా 16,109, ఢిల్లీలో 2,411, మహారాష్ట్రలో 1,343 ఫిర్యాదులు నమోదయ్యాయి. బీహార్లో 1,312, మధ్యప్రదేశ్లో 1,165, హర్యానాలో 1,115, రాజస్థాన్లో 1,011, తమిళనాడులో 608, పశ్చిమ బెంగాల్లో 569, కర్ణాటకలో 501 ఫిర్యాదులు నమోదయ్యాయి. 2022 నుండి 30,864 ఫిర్యాదులు అందగా, 2023లో 28,811 ఫిర్యాదులు నమోదయ్యాయి.